క్లుప్తంగా

సింహపురికాలనీలో అన్నసమారాధన



అన్నప్రసాదం అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ నాయకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలోని సీతారామాలయ, ఉపాలయాల వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, అధ్యక్షుడు కామేశ్వరరావు, కార్యదర్శి మురళీబాబు, రామాలయ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, అసోసియేషన్ మాజీ కార్యదర్శి నడింపల్లి రామరాజు, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిరంజీవిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు, అర్చకుడు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామికి విశేష పూజలు



భైరవస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని భైరవవాకలోని భైరవస్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భైరవుడిని దర్శించుకున్నారు. అమృతకలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు స్వామికి పంచామృతాభిషేకాలు, విభూదితో అభిషేకం నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఆలయానికి వెళ్లే రెండు కిలోమీటర్ల దారి భక్తజన సంద్రంగా మారింది.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

పరవాడ: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పరవాడ, కలపాక గ్రామాలను సందర్శించనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. పరవాడ బీసీ కాలనీ, కలపాక గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారని చెప్పారు.

10 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం గ్రామానికి చెందిన నిర్భయసింగ్ పడియార్ అనే వ్యక్తి మద్యం దుకాణం నుంచి అక్రమంగా 10 (180 ఎంఎల్) మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

విశాఖ బంజారా అసోసియేషన్ నూతన కార్యవర్గం



ఎన్నికైన బంజారా అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: విశాఖ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివారం ఉక్కునగరం స్వర్ణజయంతి పార్కులో అసోసియేషన్ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ లెక్కలను ఆమోదించారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో అధ్యక్షుడిగా బీఎంకే నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ కృష్ణ, కోశాధికారిగా రత్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.శివరాం, సంయుక్త కార్యదర్శిగా డి.రాజు నాయక్, ఉపాధ్యక్షుడిగా ఎ.తిరుపతి నాయక్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.తిరుపతి నాయక్‌తో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్. హనుమంతు నాయక్, బి. బాలాజీ, ఎం.లక్ష్మణ్, ఆర్.శంకర నాయక్, ఎస్.బలరామ్ ఎలక్షన్ కమిటీగా వ్యవహరించిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు సర్కారు దన్ను

- అంబులెన్స్‌ల ద్వారా గ్రామాల్లోనే వైద్యం
- సబ్సిడీపై మూగజీవాలు
- పథకాలతో మేలు చేసిన సీఎం జగన్



1962 అంబులెన్స్



రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



దూడకు ఇన్సూరెన్స్ బిల్ల వేస్తున్న రైతు భరోసా కేంద్రం సహాయకురాలు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలుస్తోంది. పాడి పశువుల ఆరోగ్యంతో పాటు రైతులకు ఆదాయం చేకూరేలా పథకాలు అమలు చేస్తోంది. విశాఖ జిల్లాలో 2019 నుంచి 2024 వరకు ఎంతో మంది పాడి రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూర్చారు. వైఎస్సార్ పశు బీమా, వైఎస్సార్ పశు నష్టపరిహారం, అంబులెన్స్‌లు ద్వారా పశు ఆరోగ్య సేవలు, అమూల్ పాల సేకరణ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు చేయూతనిచ్చారు. పశు సంవర్ధక శాఖ అమలు చేస్తున్న అనేక పథకాలను వేలాది మంది పాడి రైతులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఆయా పథకాల వివరాలిలా..

వైఎస్సార్ పశు బీమాతో ధీమా

వైఎస్సార్ పశు బీమా పథకాన్ని 2023-24 సంవత్సరంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు కూడా బీమా చేయించుకోవచ్చు. ఏపీఎల్, బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులు. ఆవులు, గేదెలకు మూడేళ్ల పాటు బీమా చేయడానికి రూ.2 వేలు చెల్లించాల్సి ఉంది. కానీ పాడి రైతులు 20 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. గొర్రెలు, మేకలకు బీమా కోసం రూ.400 కట్టాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు 20 శాతం మాత్రమే బీమా రుసుం చెల్లించాలి. మిగతా 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. విశాఖ జిల్లాలో ఇంత వరకు 2,210 ఆవులు, 652 గేదెలు, 139 మేకలు, 69 గొర్రెలకు బీమా చేయించారు. దూడ పుట్టిన నుంచి 15 సంవత్సరాల వరకు బీమా చేయించవచ్చు. ఇంత వరకు జిల్లాలో ఇందు కోసం రూ.25 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది.

వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం

పాడి పశువు మరణిస్తే రైతు నష్ట పరిహారం పొందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. పుట్టిన 2 నుంచి 12 సంవత్సరాలు వయసు గల పాడి పశువు(కనీసం ఒక ఈత ఈని ఉండాలి) మరణిస్తే నష్ట పరిహారం అందుతుంది. ఈ పథకం 2022 నుంచి అమలులో ఉంది. ఇంత వరకు జిల్లాలో 2,872 మది పాడి రైతులు ఈ పథకం ద్వారా రూ.8.12 కోట్ల పరిహారం పొందారు. మరో 729 మంది లబ్ధిదారులకు రూ.2.16 కోట్లు ట్రెజరీలో పెండింగ్‌లో ఉంది.

56 రైతు భరోసా కేంద్రాలు

జిల్లాలో 56 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో పశు వైద్య సహాయకులు అందుబాటులో ఉన్నారు. రాజన్న పశు వైద్యం ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటి వద్దకు వెళ్లి అవసరమైన మందులు కూడా సరఫరా చేస్తున్నారు. రైతులకు పాల ఉత్పత్తి, పశువుల ఆరోగ్యంపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. 2023-24లో 60 శాతం రాయితీపై సమీకృత దాణా అందిస్తున్నారు. ఇంత వరకు 742 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

అమూల్ పాల సేకరణ

పాడి రైతులకు చేయూతనివ్వడానికి అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఈ కేంద్రాల ద్వారా లీటరు పాలుకు రూ.5 అదనంగా ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా రోజుకు 30,000 లీటర్ల పాలు సేకరిస్తున్నారు.

'భీమిలి'లో వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

ఇంతవరకు ఎప్పుడూలేని విధంగా పశువులకు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇటీవల జిల్లాలో భీమిలి నియోజకవర్గంలో ఈ ప్రయోగశాల ఏర్పాటు చేశారు. దీనిలో ఇప్పటి వరకు 3,253 పశువులకు క్షేత్రస్థాయి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టారు.

వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ

వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ ద్వారా 1962 నంబరుతో అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. 1962 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా పాడి రైతులు ఈ సేవలు పొందవచ్చు. ఇందులో పశువులకు 12 రకాల పరీక్షలు చేస్తారు.

ఒక వైద్యుడు, మరో సహాయకుడు, ఓ డ్రైవర్ అందుబాటులో ఉంటారు. పెద్ద హైడ్రాలిక్ నిచ్చెన ఉంటుంది. నడవలేని పశువులను ఈ నిచ్చెన ద్వారా అంబులెన్స్‌లోకి ఎక్కించి అందుబాటులో ఉన్న పశు వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తారు. జిల్లాలో 10 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంత వరకు జిల్లాలో ఈ అంబులెన్స్‌ల ద్వారా 29,686 పాడి పశువులకు వైద్య సేవలు అందించారు.

జిల్లాలో పశువులకు సౌకర్యాలు

జిల్లాలో పశువుల ఆస్పత్రులు-3, పశు వైద్య కేంద్రాలు-17, గ్రామీణ పశు వైద్య కేంద్రాలు-2, గోపాల మిత్ర కేంద్రాలు-14, రైతు భరోసా కేంద్రాలు-56 ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో ఘనీకృత వీర్య కేంద్రం, యాంద్రాలజీ ల్యాబ్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, జాతీయ పశు వ్యాధుల పరిశోధన కేంద్రం,, ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ శిక్షణా కేంద్రం ద్వారా పాడి రైతులకు సేవలు అందుతున్నాయి. ఇవి గాక గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, పశవులకు వ్యాధి నివారణ టీకాలు, కృత్రిమ గర్భధారణ, పశుగ్రాస సాగు, రైతు సదస్సులు కొనసాగుతున్నాయి.

పాడి రైతులు మేలు చేస్తున్నాం..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా పశు సంవర్థక శాఖ పాడి రైతులకు ఎంతో మంచి చేస్తోంది. 1962 నంబరుతో జిల్లాలో 10 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో పాల ఉత్పత్తి పెంపుదల, పశువుల ఆరోగ్యంపై రైతులకు తరచూ అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు సబ్సిడీపై దాణా సరఫరా చేస్తున్నాం. వైఎస్సార్ పశుబీమా, వైఎస్సార్ పశు నష్ట పరిహారం, తదితర పథకాల ద్వారా మేలు చేస్తున్నాం.

– రామకృష్ణ, జేడీ, విశాఖ జిల్లా పశు సంవర్థక శాఖ

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కొలుసు ఈశ్వరరావు

సింహాచలం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కొలుసు ఈశ్వరరావు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేశారన్నారు. 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ఆయన ప్రజలకు చేసిన మంచిని ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి అందించని సంక్షేమ పథకాలు జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. అలాంటి నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతీ కార్యకర్త, నాయకుడు పట్టుదలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు సంబంధించి నాయకులంతా ఒక ప్రణాళికతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ,మజ్జి ధర్మా, దొంతల సంతోష్, దిలీప్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: మాఘమాసోత్సవాల్లో భాగంగా సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆఖరి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో స్వహస్తాలతో పాయసం వండించి స్వామికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

- డీసీపీ-2 సత్తిబాబు



పులగాలిపాలెంలో నేరాలపై అవగాహన కలిస్తున్న డీసీపీ-2 సత్తిబాబు

పెందుర్తి: నేరాల నియంత్రణలో భాగంగా ప్రతీ అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని నగర డీసీపీ-2 సత్తిబాబు సూచించారు. పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెంలోని ఓ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఆదివారం స్థానికులకు నేరాల నియంత్రణ-ప్రజల భాగస్వామ్యం అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నేరాలు జరిగే సమయంలో సీసీ కెమెరాల ఫుటేజీలు నేరగాళ్లను పట్టుకోవడానికి ఉపయోగపడతాయని చెప్పారు. వేసవి వస్తున్న తరుణంలో ప్రజలు నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇళ్లు విడిచి బయటకు వెళ్లేపటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో కచ్చితంగా గస్తీ ఉంచుతామన్నారు. ఇంట్లో కొద్ది రోజుల పాటు ఉండని పరిస్థితిలో విలువైన ఆభరణాలు, నగదు లేకుండా చూసుకోవడం మంచిదన్నారు. లా అండ్ ఆర్డర్, క్రైం విభాగం సీఐలు ఎల్.రామకృష్ణ, శ్రీనివాసరావు, ఎస్ఐ సింహాచలం, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



వాడచీపురుపల్లిలో కవాతులో పాల్గొన్న సీఐ బాలసూర్యారావు తదితరులు



వాడచీపురుపల్లిలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

- సీఐ బాలసూర్యారావు
- వాడచీపురుపల్లిలో పోలీసుల కవాతు

పరవాడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ బాలసూర్యారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కేంద్ర పోలీసు బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మండల పరిధిలో గొల్లపేట, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎవరూ వివాదాల జోలికి పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సిరపరపు సురేష్, ఏఎస్ఐలు వర్మ, త్రినాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

కార్పొరేటర్ ముమ్మన దేముడు



సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: వార్డులోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు.

వార్డు పరిధిలోని పలు కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు,డ్రైన్లను ఆదివారం కార్పొరేటర్ దేముడు ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని సీసీ రోడ్డు,డ్రైన్, గాయత్రీ నగర్‌లోని సీసీ రోడ్డును, జీవీ కాలనీలోని డ్రైన్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు,కాలనీ పెద్దలు కోరాడ చందు యాదవ్,జి. బుజ్జి,విజయేంద్ర,కృష్ణ,చీర రాజు,రమణమూర్తి,లక్ష్మీనారాయణమూర్తి,సత్యనారాయణమూర్తి, మురళీ కృష్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి,ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు.స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాలయంలో 5వ తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 501 మంది దరఖాస్తు చేసుకోగా 400 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్‌వీవీ సత్యారావు తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్షకు 333 మంది దరఖాస్తు చేసుకోగా 267 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు పరిశీలకులుగా హెడ్ ఆఫీస్ నుంచి నాంచారి,జిల్లా నుంచి కె. శ్రీహరి, మండలం నుంచి ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి వ్యవహరించారు.


ప్రజాసంకల్పానికి కేంద్రం తలవంచక తప్పదు



ఉక్కు దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం : ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం పోరాటాల పురిటి గడ్డ అయిన విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసిన ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్ప దని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు 1,123వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, హెచ్ యం యస్ యూనియన్ నాయకులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలుపుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు,ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చిన అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, హెచ్.యం.యస్ యూనియన్ ప్రతినిధులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్



ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

సీతంపేట: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకి సెంటర్‌లో స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించాయి. ప్రఖ్యాత కథకులు సీతా శ్రీనివాస్ ఆఫ్రిక కథ పద్ధతిలో సైన్స్, మ్యాథ్స్ కాన్సెప్ట్‌లను కథల రూపంలో పిల్లలు ఆసక్తిగా వినేలా చెప్పారు. ఆకర్షణీయమైన కథల ద్వారా సమయం, దూరం, గురుత్వాకర్షణ, శిలలు తదితర విషయాలపై వివిధ భావనలను వివరించారు. అద్భుతమైన కథా కళ ద్వారా చక్కటి కథలు చెప్పి పిల్లలను మంత్రముగ్ధులను చేశారు. ఆఫ్రికాలోని గొప్ప జానపద కథల నుంచి ప్రేరణ పొందిన కథలను కథా నైపుణ్యాలతో పిల్లలకు బోధించారు. కథ చెప్పడంతోపాటు సమయానికి తగిన పాటలు, అభినయనంతో చిన్నారుల ఆసక్తిని కథల వైపు మళ్లించారు. అనంతరం ఓరగామి, వర్క్‌షీట్‌లను నింపడం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.